పదవి, అయిశ్వర్యం మానవతను మరిపిస్తాయి. అవేవీ లేనివాడిలో ఉన్న దయాగుణం ఉన్న వారిలో కనిపించినా, అది డాంబికమాత్రమే! మానవత్వం ఒక్కోసారి హోదాను, డబ్బును చూసి పరిహసిస్తుంది.

# చలి!... చలి... చలి!...

## మన్నెం శారద



**ఆది డిసెంబరు నెల!**

**రాత్రి ఎనిమిదిగంటలవేళ!**

రాఘవరావుగారిల్లు దీపాలతో శోభాయమానంగా వుంది!

ఆ దీపాల కాంతికి చీకటి, డైనమైట్ పెట్టి పేల్చినా పేలని దట్టమైన గోడల క్రింద నక్కింది!

లాన్‌లో వేసిన కుర్చీల్లో రాఘవరావుగారు విలాసంగా కూర్చొని చిరునవ్వులు చిందిస్తున్నారు.

ఇంటి ముందు ఎన్నో కార్లు!

కొన్ని సాగి పోతుంటే మరికొన్ని ఆగుతున్నాయి.

వచ్చేవాళ్ళతో, పోయేవాళ్ళతో ఆ ప్రాంతం ఎంతో సందడిగా వుంది!

రాఘవరావుగారి ముందున్న టీపాయ్ పూలదండలతో – పూలగుచ్ఛాలతో నిండి పోతున్నది! అప్పుడప్పుడూ నౌకరు వాటిని లోపలికి తరలించి ఇంకా వచ్చే వాళ్ళ కోసం ఖాళీ చేస్తున్నాడు!

ఆలింగనాలతోనూ, కరచాలనాలతోనూ రాఘవరావుగారు అలిసి పోయేరు.

"మళ్ళీ మీరే మా మినిస్టర్ కావడం మా అదృష్టం! ఈ మధ్యంతర ఎన్నికల మూలంగా మీరు తలపెట్టిన స్కీములు ఆగి పోతాయని భయపడ్డాం!" అన్నాడొక సిల్కులాల్చీ, బట్టతల వ్యక్తి ఉంగరాల చేత్తో బట్టతలని సవరించుకుంటూ.

రాఘవరావుగారు గుంభనంగానవ్వేరు.

"నీ కాంట్రాక్టులకేం దెబ్బలేదులే!" అన్నారు కాస్త వెటకారంగా.

"అబ్బే! ఎంత మాట? మీరు పదవిలో ఉండాలేగాని ఇలాంటి కాంట్రాక్టులు వందలు దొరుకుతాయి నాకు!" అన్నాడతను సర్దుకుంటూ.

"టైమెంత?"

"తొమ్మిది దాటింది!" చెప్పారెవరో.


"సరే మరి! ఈ రెణ్ణెల్లగా తిండీ నిద్రా లేవు! కన్ను మూస్తే మనోళ్ళ నోట్లో

"మట్టి కొట్టెయ్యాలని ప్రయత్నించేరు అవతల పార్టీవాళ్ళు! మరి రోజుకి నేను రెస్టు తీసుకుంటాను. రేపు కలుద్దాం!" అన్నారు రాఘవరావుగారు గట్టిగా ఆవులిస్తూ.

వెంటనే అక్కడి జనం చేతులు జోడించి శెలవు తీసుకున్నారు.

అందరూ వెళ్ళేక రాఘవరావుగారి భృకుటి ముడి పడింది.

"వరహాలూ!" అంటూ గట్టిగా కేక పెట్టేరు.




వరహాలు గబగబా పరిగెత్తుకొచ్చి నిలబడ్డాడు.

"నారాయణరావుకి ఫోన్ చేసేవా?" అన్నారాయన కాస్త చిరాగ్గా.

"చిత్తం! చేసేనండయ్యా!"

"ఏమన్నాడు?"

"ఏవన్నా అంటానికి ఎన్ని గుండెలు కావాలి! తమరు సెప్పిందానికి ఏవన్నా రయ్యా!" అన్నాడు వరహాలు వినయంగా.

"ఎప్పన్నాడు లేవయ్యా! ఇంతవరకూ వచ్చి చావలేదు? అవతల నాకు మాటొచ్చేస్తది!" అన్నాడు రాఘవరావు కోపంగా.

అప్పుడే గేటుముందు ఎంబాసిడర్ కారొకటి ఆగింది.

అందులోంచి దిగిన వ్యక్తిని చూడగానే వరహాలుతో పాటు రాఘవరావుగారి ముఖం వికసించింది.

అయినా అయన దాన్ని బయట పడనివ్వకుండా ముఖాన్ని గంభీరంగా పెట్టుక్కూర్చున్నారు.

ఆ వచ్చిన వ్యక్తి రాఘవరావుగారికి సాష్టాంగ పడినంత పని చేసి ఆయన మెళ్ళో దండేసి వినయంగా నిలబడ్డాడు.

"ఏటింత ఆలస్యం! అయ్యగారు మండి పడి పోతున్నారు!" అన్నాడు వరహాలు కలుగ జేసుకొని.

"క్షమించాలి! మంచి రకం కోసం కాస్త ఎక్కువ తిరగాల్సి వచ్చింది! పుమ్మిడియార్స్ నుండి సరాసరి మీనంబాకం ఎయిర్‌పోర్టు కొచ్చి వియానంలో బేగంపేట్‌లో వాలి తిన్నగా యిక్కడికొచ్చేసేను!" అన్నాడు బాక్సు రాఘవరావుగారి చేతిలో పెడుతూ.

రాఘవరావుగారు బాక్సందుకొని నవ్వి "మద్రాసెళ్ళేవా?" అతనికి శ్రమ యిచ్చినందుకు ఎంతో యిదయి పోతున్నట్లుగా.

"లేకపోతే ఇక్కడి సరుకేం బాగుంటుంది సార్! అదకక్కదక్క అడిగేరు" అన్నాడు నారాయణరావు.

రాఘవరావుగారు బాక్సు తెరిచేరు! వరహాలు వంగి ఆసక్తిగా చూసేడు? ఇద్దరి కళ్ళు జిగేలు మన్నాయి!

"చాలా ఖర్చుపెట్టేసి నట్టున్నావు!" అన్నారు రాఘవరావుగారు చాలా నొచ్చుకుంటున్నట్టుగా.

"ఖర్చుదేవుందిలెండి! మీకు నచ్చదని నా భయం!

"అం! ఈటి సంగతి నాకేంతెలుసు. ఏదో ఆడోళ్ళ పిచ్చి! ఏ దెట్టుకుంటే జరగదు! నా మటుకు నాకు ఈ ఖద్దరు పంచి, లాల్చీ వుంటే చాలయ్యా. మళ్ళీ సారి గెలిస్తే నాకు డైమండ నెక్లెస్ .... నెక్లెస్ అంటూ మా ఆవిడ యిల్లంతా హర్పింగ్ చేసేస్తుంటే నీకు చెప్పక తప్పలేదు." అన్నారు రాఘవరావుగారు తనకేం వ్యామోహాలు లేనట్లు.

"పోనీలెండి వారి ఆనందం వారిది." అన్నాడు నారాయణరావు చేతులు నలుపుకుంటూ.

"మరింక ఎళ్ళిరా. పాపం మద్రాసు నుంచి ఇటే వచ్చేసినట్లున్నావు." అన్నాడు రాఘవరావు జాలిగా.

"అయ్! నేనుంటానండి. మరి ఆజ్ఞ. ఓ ...." అంటూ నసిగేడు నారాయణరావు.

రాఘవరావు ఖళ్ళున నవ్వి "నువ్వు మళ్ళీ చెప్పాలేంటయ్యా. నేను రేపుసీట్లో కెళ్ళగానే మొట్టమొదట సంతకమెట్టేది నీ ఫైలే!" అన్నాడు.

నారాయణరావు ముఖం తను తెచ్చిన రవ్వల నెక్లెస్‌లా వెలిగి పోయింది.

"తమదయ. వస్తుంటానండి." అంటూ

## నా గురించి



సరికొత్త పరిచయం ఇప్పుడు ఇవ్వాల్సిన అవసరం లేదను కొంటాను. అయినా చెప్పాల్సి వచ్చినప్పుడు చెప్పడంలో తప్పు లేదనుకొంటాను. రచయిత్రిగా నాకంటూ ఒక రెండు వందల కథలు, పది నవలలు ఉన్నాయి. నా మొదటి నవల- నా రెండవ నవల వరుసగా మొదటి, రెండవ బహుమతులు గెలుచుకోవటం నాకొక సంతృప్తిని ఇచ్చింది. మనసు స్పందించి నప్పుడు వ్రాసిన రచనలే అత్యుత్తమంగా వుంటాయని నా అభిప్రాయం. మంచిపేరు తెచ్చుకోవడం కన్నా మంచి మనిషిగా బ్రతకాలన్నదే నా ఆశయం.

—మన్నెం శారద

వెళ్ళి పోయేడతను.

నారాయణరావు ఆ వెళ్ళగానే రాఘవరావుగారు వళ్ళు విరుచుకొని "చాలా చలిగా వుందికదూ!" అన్నారు వరహాలొంక చూస్తూ.

"అవునండయ్యా" అన్నాడు వరహాలు కాస్త ముసి ముసిగా నవ్వుతూ.

"ఏంటో! ఈ ఎలక్షన్ల హడావుడిలో ఏ సీజనొచ్చి, ఏ సీజన్ పోయిందీ తెలీలేదనుకో!" అన్నారాయన నెక్లేస్ పెట్టె వంక చూసుకుంటూ.

"మరిది .... అమ్మగారి కిచ్చేమంటారా?" అన్నాడు వరహాలు బాక్స్ వంక చూస్తూ.

"నీ ముఖం. ఈ సంగతి దానిగ్గాని చెప్పేవు కనక" అన్నాడు రాఘవరావుగారు గంభీరంగా.

"మరి .... అమ్మగారు అడిగేరని చెప్పేరు" అన్నాడు వరహాలు తెల్లబోతూ.

రాఘవరావు విలాసంగా నవ్వి "మరి అలా చెప్పక పోతే నా ఉంపుడుకత్తె వరదా వచిందని చెప్పమంటావా?" అన్నారు.

"అయితే ఇది పారిజాతానికన్నమాటండయ్యా."

"అన్నమాటేంటి నీముఖం. ఉన్నమాటే" అన్నారు రాఘవరావుగారు.

"దానికింత ఖరీదైన .... ...."

"ఉష్! తెలివి తక్కువగా సొమ్ము వెదజల్లే సన్నాసి కాదు రాఘవరావంటే. ఈ ఎలక్షన్లలో అది నాకు చాల సాయం చేసింది: కొన్ని సీక్రెట్ ఎవ్వారాలు అది కూపీ లాగ బట్టే నేనొడ్డెక్కేసేను. ఇంట్లో ఆడోళ్ళు అది కావాలి, ఇదికావాలి అని మొగుణ్ణి దూదేకేసినట్లు ఏకేస్తారే గాని .... అవసరమైతే వళ్ళడ్డమేసి మనల్ని ఒడ్డునేస్తారా? ఏంటో ఈళ్ళకి ఇల్లాళ్ళని .... ఆళ్ళని .... ఉంపుడు కత్తెలని పేరెవరు పెట్టేరో" అంటూ పారిజాతాన్ని తలచుకొని తెగ జాలి పడి పోయేరు రాఘవరావుగారు.

వరహాలు అవాక్కయి నిలబడి చూసేడతనివైపు.

"అద్సరే. ఇప్పటికే ఆలీసం అయిందని పారిజాతం మూడంకె ఏసినా ఏసేస్తది. ఛీఫ్ మినిష్టర్నుండి అర్జెంటుగా ఫోనొస్తే ఆగమేఘాల మీద ఎల్లిపోయేనని మీ అమ్మగారికి చెప్పేయ్. లోపలకెళ్తే బయటకి రావడం కుదరదని పని" అంటూ బాక్స్ తీసుకొని లేచినిలబడ్డారు రాఘవరావుగారు.

## త్రీడి సినిమా అంటే?

"త్రీడి సినిమా అంటే ఏమిటోయ్?" అడిగాడు డేవిడ్ మోహన్ని.

"త్రీడేస్" మాత్రమే ఆడిపోయేదోయ్!" అంటూ టక్కున చెప్పాడు మోహన్.

—కృష్ణమోహన్
[ముసరంబాగ్]

వరహాలు అలాగేనంటూ తలవూపేడు.

"జాగ్రత్త. నెక్లేస్ సంగతి అమ్మగారితో అనేవుగనక." అంటూ కారువేపు నడిచేరు రాఘవరావుగారు.

కారు అ వెళ్ళగానే జానికమ్మ బయటకొచ్చింది.

"ఎటెళ్ళేర్రా మీ అయ్యగారు?" అంటూ.

వరహాలు తడబడుతూ "అదేసమ్మా. ఛీఫ్ మినిష్టరుగారు అర్జెంటుగా రమ్మంటే ...." అన్నాడు నసుగుతున్నట్లుగా.

జానికమ్మ నవ్వింది.

ఏడ్చేవులేరా సన్నాసి. అబద్ధం చెప్పడం కూడ చేతగాదు. ఆయనగారు ఈ వేళప్పుడు ఎక్కడికి పరిగెత్తుతారో నాకు తెలియదని. సర్లే. వెళ్ళి యింట్లో వ్యవహారాలు చూడు" అంది.

వరహాలు గబ గబా లోపలి కెళ్ళేడు.

జానికమ్మ వయ్యారంగా ఫోను దగ్గరికెళ్ళింది.

వరహాలు లోపల్నుంచి అమ్మగారినే చూస్తున్నాడు.

వయసు నలభయిపైన వున్నా కనిపించదు జానికమ్మ. బిగువైన శరీరం, వంటినిండా నగలు. రోకలి పోతేసినట్లు ధీమాగా నడుస్తుంది.

ఆమె ఒక నెంబర్ డయల్ చేసి "హలో" : అంది.

అటువైపు ఆమెకు కావాల్సిన వాళ్ళ గొంతు వినిపించింది కాబోలు — ఆమె వయ్యారంగా మెలికలు తిరిగి "ఆయన పారిజాతం కొంపకి తగలడ్డారు. మీరొక అరగంటలో బయల్దేరి వచ్చేయండి!" అంది.


ఆమె మాట్లాడే విధానాన్ని బట్టి జానికమ్మ ఎవరితో మాట్లాడుతుందో ఇట్టే గ్రహించేసేడు వరహాలు.

ఆ ఇంట్లో జరిగే ప్రతి విషయం, గుట్టు వరహాలికి తెలుసు. ఒక విధంగా ఎంత పెద్ద హోదాలో వున్నా రాఘవరావుగారు - ఇటు జానికమ్మ కూడ అతన్ని దగ్గరికి పిలిచి తమ బాధలు చెప్పుకుంటారు.

వరహాలు తమ సమస్యలు తీర్చలేడని వాళ్ళకీ తెలుసు.

వరహాలు ఆ ఇంటి నౌకరని కూడ వాళ్ళకి తెలుసు.

అయినా వరహాలికి వాళ్ళు మనసులో పెద్ద పీటే వేసేరు. కారణం వరహాలు గుండెల్లో పడ్డ మాట బయటకి ఛస్తే పొక్కదు. అతను అసలు వాళ్ళు చెప్పింది వింటాడో లేదో అన్నంతగా దాన్ని తన మనసు లోపలి పొరల్లో పాతరేస్తాడు. భార్యా భర్తలిద్దరికీ ఎవరికి



వారికే కావాల్సిన వ్యక్తిలా ప్రవర్తిస్తాడు.

ఎంత డబ్బున్నా, ఎంత బలగంవున్నా మనసు విప్పి మాట్లాడు కోటానికి ఒక వ్యక్తి కావాలి ఎవరికైనా. కాని ఆ వ్యక్తే నమ్మక ద్రోహం చేసి ఉన్నదానికి రంగులు వేసి ప్రచారం చేసి ఆనందిస్తే ఎవరూ భరించలేరు. అందుకే అలాంటి నీచ గుణంలేని వరహాల్ని ఇంటి నౌకరు కన్నా ఒక ఆత్మబంధువుగా చూసు కుంటారు ఇటు రాఘవరావు – అటు జానికమ్మ కూడా!

చూశావురా. కట్టుకున్న దాన్ని నేనున్నానని ధాతరు లేకుండా – ఆనందం వచ్చినా దుఃఖం వచ్చినా దాని దగ్గరికే పరిగెత్తు తారు మీ అయ్యగారు. నా వంటి మీద నా నగలు – హోదా చూసి ఎంతో సుఖ పడి పోతున్నానని ఏడుస్తారు చుట్ట పక్కాలు. ఏదీ ఒక్క రాత్రయినా వుంటేనా. అని వాపోతుంది జానికమ్మ.

దానికి నగల పిచ్చి, పదవి పిచ్చేగాని మొగుడికేం కావాలో – ఎన్నడయినా చూసెరిగిందా. డబ్బుకి వళ్ళమ్ముకుంటే నేం ఆ పారిజాతం నేను కనపడక పోతే బెంగెట్టేసుకుని మంచమెక్కేస్తది. నా మీద ప్రేమతో ఏం చెయ్యడానికన్నా సిద్ధపడ్తది. అసలు వ్యభిచారం. వ్యభిచారం అంటారు కాని కట్టుకొన్న పెళ్ళాం మాత్రం మొదట దాని కోరికలు తీర్చకుండా మన కోరికలు తీరుస్తదా? అంటూ బాధపడ్తారు రాఘవరావుగారు.

అతనికి యిద్దరి మాటా సమంజసమే ననిపిస్తుంది.

నేను మాత్రం మనిషిని కానా! ఎన్నాళ్ళిలా వంట్లో సత్తువ పెట్టుకొని వేగి పోవాలి. అందుకే నేనంటే పడిచచ్చే చందన్‌లాల్‌ని కాదన లేక పోయేన్రా. అమ్మగారింత బరి తెగించేసిందను కుంటున్నావా? అంటుంది జానికమ్మ అప్పుడప్పుడూ.

వరహాలు ఏం మాట్లాడడు.

తల అడ్డంగా తిప్పి అక్కణ్ణించి జారుకుంటాడు.

పిచ్చి సన్నాసి, మంచి వెధవ. అని నవ్వుకుంటుంది జానికమ్మ.

జానికమ్మ అర్జెంటుగా నేతి మిఠాయి వ్యాపారస్తుడు చందన్‌లాల్‌కే ఫోను చేస్తుందని వరహాలు గ్రహించేడు. చందన్‌లాల్‌కి అదొక్కటే కాక వూళ్ళో చాల పెద్ద బిజినెస్‌లున్నాయి. అయినా మొదట ఆ వ్యాపారంతో పైకొచ్చేడు కాబట్టి అతన్ని నేతిమిఠాయి చందన్‌లాల్ అని పిలవడమే కద్దు.

త్వరగా వచ్చేయాలి. చాల చలిగా వుంది. కదూ. అంది జానికమ్మగారంగా.

ఆమె ఫోను పెట్టేసి మేడ మీద తెళ్తూ లాల్ గారొస్తారు పైకి పంపించు. నువ్వు మిగతా సంగతులు చూసుకో. అంటూ వరహాల్ని హెచ్చరించి మెట్లెక్కింది జానికమ్మ.

❊ ❊ ❊ ❊

పారిజాతం ఎదురు రాక పోయే సరికి కాస్త ఖంగు తిన్నారు రాఘవరావుగారు.

"పారిజాతం ఏది! అన్నారు గంభీరంగా ఎదురొచ్చినవాళ్ళమ్మ నవనీతంతో.

ఇప్పుడుదాక తమకోసం ఎదురు చూసి ఎదురు చూసి అలిగి గదిలో పడుకుంది. అంది

"మినిస్ట్రీ అంటే మసాలా వడలమ్మ దం అనుకుంటుందా. ఎన్ని వ్యవహా లుంటాయి మాకు" అన్నారు రాఘవరావు గారు కాస్త గంభీరంగా.

"అదంతా దానికేం తెలుసుబాబూ. మీ కోసం పడిగాపులు పడి ఎదురు చూడ్డం తప్ప. కట్టుకున్న వాడైతే అర్నెల్లకన్నా వస్తాడని గేరంటీ వుంటుంది. తమకోసం చికెన్ బిరియాని, రొయ్యల వేపుడు చేసి ఎప్పణ్ణించి ఎదురు చూస్తుందో. పిచ్చి పిల్ల" అంది నవనీతంగా తన సహజ ధోరణితో వగలు కురిపిస్తూ.

రాఘవరావుగారు పారిజాతం గదిలో కెళ్ళేరు.

పారిజాతం అతన్ని చూసి మూతి బిగించింది.

మూతి బిగించిన పారిజాతాన్ని చూడ గానే మతి చెడి పోతుంది రాఘవరావు గారికి.

ఆయన బయట ప్రపంచంలో పులిలా బ్రతికినా పారిజాతం దగ్గర పిల్లయి పోతారు. అలకలతో ఒక్క క్షణం వృధా అయినా జీవితమే వృధా! అన్నంత బాధ కల్గుతుందాయనకి.

ఆయన మెల్లిగా పారిజాతం పక్కకి చేరి రవ్వలహారం ఆమె మెడలో పెట్టి

## దృష్టి



ఈ శబ్ద ప్రపంచం నుంచి
నన్ను నిశ్శబ్ద లోకానికి
నా సుందర స్వప్న వనాలికి
నీ నీడలా తోడ్కొని వెళ్ళు
సూర్యుడు, చంద్రుడు, లేనిచోట—
నీ హృదయం సంగీతం
నా మనస్సు మౌన గీతం
ఆ సంగీతంలో నీ స్వరూపం
ఆ గీతంలో నా విశ్వరూపం
నా కన్నుల్లోకి నువ్వు
నడిచి వస్తావు
నా భావానికి అక్షరంగా
హారతి పడతావు
నా గీతానికి పల్లవిగా
రూపు దిద్దు కుంటావు
నిర్వికారంగా వుండే నీలో
నన్ను చూసుకుంటాను
నువ్వు వేరు కాదన్న భావం
నా కిప్పుడు స్ఫురిస్తుంది
నువ్వు భావం, నేను భాష
నువ్వు జవం, నేను జీవం
నువ్వు దృష్టి, నేను ద్రష్ట
నువ్వు ప్రకృతి
నేను పురుషుడు

—భగీరథ

ఇప్పటికే ఆలస్యమై పోయింది. మళ్ళీ అలకా?" అన్నారు ముద్దుగా.

పారిజాతం చిలిపిగా నవ్వి హారం వైపు చూసుకుంచి.

"అలకకి పరిహారమా?" అంది కొంటెగా

"ఏదైనా అనుకో!" అంటూ ఆమెను కౌగిలించుకో బోయేరు.

"ఆగండాగండి, అవతల విందు భోజనం మీకోసం సిద్ధంగావుంది."

అంది పారిజాతం పక్కకి తొలిగి.

"నేను తిండిబోతు రాముణ్ణను కున్నావా పక్కన పారిజాతాన్ని పెట్టుకొని డైనింగ్ టేబులు మీదికి ఎగబడ్డానికి!" అన్నారు రాఘవరావు గారు పారిజాతం జడపట్టు కొని గుంజుతూ.

పారిజాతం కావాలనే అతని వళ్ళోకి వచ్చి పడింది. అలా వళ్ళో ఒదిగిపోయిన పారిజాతాన్ని ఆఘ్రాణిస్తూ చాలా చలిగా వుంది కదూ! అన్నారు రాఘవరావుగారు శృంగార రాముడిలా ఆమె కళ్ళలోకి చూస్తూ.

"చలికాలం వచ్చి రెండు నెలలయ్యింది! తమకిప్పటికి చలి పుడుతున్నది కాబోలు? రండి. నా తృప్తి కోసమైనా కాస్త ఎంగిలి పడుదురుగాని" అంటూ పారిజాతం ఆయన్ని బలవంతంగా డైనింగ్ టేబులు దగ్గరకి లాక్కెళ్ళింది.

అయిష్టంగానే ఆమె మాట తీసేయలేక ఒక చేత్తో ఆమె నడుంని చుట్టి టేబుల్ దగ్గరకి నడిచేరు రాఘవరావుగారు!

* * *


తెల్లవారు ఝామున నాలుగ్గంటల వేళ.

అలవాటు ప్రకారం రాఘవరావుగారికి మెలకువ వొచ్చేసింది! ఆయన హడావిడిగా పక్కమించి లేచేరు.

ప్రొద్దుటే ఈ రోజు అయిదు గంటలకల్లా తను ఛీఫ్ మినిష్టర్ గారింటి దగ్గరుండాలి.

ఈరోజు పార్టీకి సంబంధించిన కొన్ని ముఖ్య నిర్ణయాలు తీసుకోవాలని నిన్ననే తెలియజేసేరు.

సి.ఎమ్. చండశాసనుడు మూడు గంటలకే లేచి కూర్చుంటాడు! అతనికి డెవిల్ వర్కరన్న పేరుంది. డిసిప్లిన్ లేదని తెలిస్తే నిముషంలో పార్టీనుండి బయటకి గెంటుతాడు.




వేలిముద్ర మంత్రిగారు ఉన్నట్టుండి, తన సెక్రటరీని పిలిచి ఇల్లా అన్నాడు-

మన ఎదురు మంత్రి ఏదో "ఆటో బయోగ్రఫీ" రాసుకుంటున్నాట్ట. మరి నా మీదో "టాక్సీబయోగ్రఫీ" రాయవోయ్.

—ప్రేమశ్రీ
[విజయవాడ]

రాఘవరావుగారు నిద్రపోతున్న పారిజాతాన్ని లేవకుండా హాల్లోకి వచ్చేరు.

""వెళ్తున్నారా బాబూ!" అంది నవనీతం.

"నాకు అర్జెంటుగా మీటింగుండి వెళ్లిపోయేనని చెప్పు!"

"ఇప్పుడేం మీటింగ్ బాబూ! బయట చలిగా వుంది" అంది నవనీతం.

పని వున్నప్పుడు చలి.... ఎండ అనుకుంటే కుదర్దు! నే వస్తా అంటూ చెప్పులు తొడుక్కున్నారు రాఘవరావుగారు.

"కనీసం ఈ శాలువా అయినా వుంచుకోండి." అంటూ ఒక శాలువా అందించింది నవనీతం.

రాఘవరావుగారు దాన్ని అందుకొని బయటకి నడిచేరు.

కారు నిర్మానుష్యమైన రోడ్లమీద శరవేగంగా వెళ్తోంది. బయట వెన్నెలతో తడిసిన చలి మరింత విజృంభిస్తోంది!

"నిజమే! కాస్త చలిగానే వుంది!" అనుకున్నారు రాఘవరావుగారు.

రాఘవరావుగారి మేడ బంజారా హిల్ లో వున్న పోష్ లొకేలిటీలో వుంది.

కారు సడెన్ బ్రేకేసినట్లాగి పోయిం

కొద్దిగా నిద్ర మత్తులో జోగుతున రాఘవరావుగారు ఉలిక్కి పడి" ఏ యింది?" అన్నారు. డ్రైవరుకేసి చూస్తు

బేక్ వీల్ పంక్చరయ్యిందిసార్. అయిదు నిముషాలు! టైరు మార్చేస్తాను!" అంటు గబ గబా డిక్కీకేసి వెళ్ళేడు డ్రైవరు.

పావుగంట గడిచింది.

రాఘవరావుగారు చుట్టూచూస్తూ విసుగ్గ గడిపేరు కాసేపు! ఎటు చూసినా రాళ్ల గుట్టలు?

వెన్నెల మాత్రం మనోహరంగా వుంది

కారులో బోరు కొట్టి రాఘవరావుగారు షాల్ కప్పుకొని క్రిందకి దిగేరు.

నిజానికి రాఘవరావుగారికి అనుకున్నంత చలి అనిపించలేదు! రాత్రి పారిజాతం యింట్లో విందు అతని వంట్లో చలిని హరించేసింది.


ఆయన కాస్త సరదాగా రాళ్ళ గుట్టల వేపు నడిచేరు!

ఆయన దృష్టి అక్కడ రాళ్ళని ఆనుకొని కూర్చొని వున్న బక్క ముసిలోడిపై పడింది.

వాడి వంటిమీద ఒక చిరుగుల పంచె తప్ప మరేం లేవు! ఆహారం లేని వాడి శరీరం చలికి చిత్రంగా వణుకు తోంది.

""ఏయ్ ఎవర్నువ్వు?" అన్నారు రాఘవరావుగారు ఒక మంత్రి హోదాలో.

ఆకలి, చలి అతని కంటి మీదికి కునుకు రానివ్వలేదేమో- అతను వెంటనే ఉలిక్కిపడ్డట్టు లేచి చేతులతో తడుముకుంటూ.



"ఎవరుబాబు తమరు!" అన్నాడు.

"నేను.... నేను.... ఒక మంత్రిని నువ్విక్కడేం చేస్తున్నావ్? నీకు యిల్లులేదా?" అన్నాడు రాఘవరావుగారు.

ముసిలోడు చిన్నగా నవ్వి "ఇల్లాబాబు అది నా బాబుకి, నా బాబు బాబుక్కూడ లేదు అదెట్టా వుంటాదో కూడ నాకు తెలవదు బాబూ" అన్నాడు.

"నీ కెవరూ లేరా?"

అంటే.... నా కర్దం కాదు బాబూ! ఎవడి పొట్ట ఆడికే బరువైనప్పుడు.... బందుత్వాలుంటాయా.... అదిగో కట్ట మొచ్చినప్పుడు.... ఒక పైసా కూడా దొరకనప్పుడు.... కుంటి కోటిగాడే నాకు సుట్టం అన్నాడు గుడ్డి ముసలోడు వేదాంత ధోరణిలో.

"రండి సార్? పని పూర్తయింది!" అన్నాడు డ్రైవరు రాఘవరావుగారి దగ్గర కొచ్చి.

సరిగ్గా అప్పుడే రాఘవరావుగారికి మెరపులాంటి ఆలోచన వచ్చింది.

వెంటనే తనవంటి మీద షాల్‌ని గుడ్డి ముసిలోడికి కప్పేరు రాఘవరావుగారు.

"ఏంటి బాబూ యిది!" గుడ్డివాడు తడుము కుంటూ అడిగేడు,

"శాలువా తాతా! నువ్వు చలికి వణకడం నేను చూడలేక పోతున్నాను! అన్నారు రాఘవరావుగారు కంఠంలో ఎంతో బాధని అరువు తెచ్చుకుంటూ.

డ్రైవరు రాఘవరావుగారి వంక ఆశ్చర్యంగా చూసేడు.

"తను పదేళ్ళుగా అయన దగ్గర డ్రైవరుగా పని చేస్తున్నాడు. కాని ఆయనలో బీదసాదల పట్ల ఇంత ఔదార్యం ఎన్నడూ చూడలేదు! సాబ్ నిజంగానే మారిపోయేరా ఆలోచిస్తున్నాడు.

సమయానికి ఫోటోగ్రాఫర్ లేనందుకు రాఘవరావుగారికి బాధగానే వుంది. కాని తన ఔదార్యాన్ని ప్రత్యక్షంగా చూసిన వ్యక్తి ఒకడున్నాడు. అతను డ్రైవరు. అతని వల్ల ఈ వార్త ప్రజల్లోకి వెళ్ళిపోయే అవకాశం వుంది. ఇలాంటి జిమ్మిక్స్ చేసే ఛీఫ్ మినిష్టరు ప్రజలకి బాగా దగ్గరయ్యేడని పత్రికలన్నీ రాస్తున్నాయి! కాబట్టి తనూ ఆ దారిలో నడవడం మళ్ళీ ఎన్నికలకి రాచ బాటవుతుంది.

"ఈ శాలువా నాకొద్దు బాబు" అన్నాడు ముసిలోడు నిశ్చలంగా.

రాఘవరావుగారితో పాటు డ్రైవరు కూడ వులిక్కి పడ్డారా మాటకి! తలకొట్టేసినట్లాయిందాయనకి.

"ఎందుకని!" అన్నారు రాఘవరావుగారు అసంతృప్తిగా.

ఇట్టా అన్నానని మీరేవీ అనుకోవద్దు బాబూ నాకీ సిరిగిన పంచెన్నా వుంది! అదిగో ఆ నీటి గొట్టంలో కుంటి కోటిగాడికి అదీలేదు! ఆడికివ్వండి బాబూ! మీకు పున్నెం దక్కుద్ది" అన్నాడు గుడ్డి ముసలివాడు ప్రాధేయ పడుతున్నట్లుగా,

రాఘవరావుగారి చెంప మీద ఎవరో ఈడ్చి కొట్టినట్లయింది. తనవంటి మీద సరైనా బట్ట లేకపోయినా తోటివాడి గురించి ఆలోచిస్తున్నాడతను: తన మానవత్వంమీద, ఔదార్యం మీద ఆ ముసిలోడి మాటలు సవాలు చేసి పరిహసిస్తున్నాయి.

మెల్లిగా వాటర్ సప్లయ్ వాళ్ల అక్కడ పెట్టిన పైప్‌లోకి తొంగి చూసేడు.

అక్కడ ఆకులు ఆచ్ఛాదనంగా కప్పుకుని ఏరుకున్న చెత్తకాగితాల మధ్య నిలువునా వణికి పోతూ.... కుంటి కోటిగాడు! రాఘవరావుగారి కళ్ళలోకి నిజంగానే తడి వచ్చింది.

తన చేతిలోని శాలువా వాడి మీద కప్పేసి వడి వడిగా కారు వేపు నడిచేరు!

తమకి చలికి. ఎ.సి గదులు. పారిజాతాలు. ఫారిన్ లిక్కర్సు ఫోమ్ పరుపులు అన్నీ కావాలి.

కాని.... వీళ్ళకి....?

ఓటు కావాల్సి వచ్చినప్పుడే మనుష్యులుగా పరిగణింప-బడే ఈ మనుషుల్ని ఎవరు రక్షించాలి.

ఆ గుడ్డి వాడి ముందు చిన్నబోయిన తన ఔదార్యానికి నిజంగానే సిగ్గేసింది రాఘవరావుగారికి.

ఈ సమస్య సి.ఎమ్ గారి ముందుంచాలని నిర్ణయించుకున్నారాయన గట్టిగా అలా నిర్ణయించుకున్నాక ఆయన కొంత లాంటి తృప్తి కల్గింది. ●

కాంక్రిట్ భవనాలె కూలిపోతున్న ఈ రోజులలో అగ్గిపుల్లలతో ఒక భవనం నిర్మించడమా?

బ్రిటన్‌లో వార్విల్‌షైర్ గ్రామం (తన స్వస్థలం)లోని అందమైన చర్చి అంటే ఫ్రెడ్‌హాల్‌కు ఎంతో ఇష్టం. తన ఇష్టానికి అగ్గిపుల్లలతో రూపకల్పన చేశాడు 71 ఏళ్ళ హాల్- చర్చిని యధాతధంగా నిర్మించేందుకు ఆయన ఎన్నో స్కెచ్‌లు వేసుకున్నాడు. చివరికి కట్టడం ప్రారంభించి ఏదేళ్ళలో పూర్తి చేశాడు. ఈ నిర్మాణానికి అయిదు లక్షల అగ్గిపుల్లలు ఖర్చయినాయి,

అయితే ఇది నిజమయిన చర్చికాదు సుమా. మోడల్ మాత్రమే. చర్చి పక్కనే ఒక శ్మశాన వాటికను కూడా నిర్మించాడు హాల్.

ఏ ఉత్సవంగాని, ప్రదర్శనగాని జరిగితే అక్కడ ఈ చర్చిని కూడా ప్రదర్శించడం ఒక అనవాయితీగా మారింది.

అగ్గిపుల్లలతో చర్చి

